ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
గురువారం | 16 జులై , 2026 | పేజీలు : 5

## ప్రజలకు చేరువగా పోలీసు సేవలు

### పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నకిరేకల్ :** పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్ రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి,పెండింగ్ కేసులు,సీసీ కెమెరాల పని తీరు, స్టేషన్ నిర్వహణ,సిబ్బంది హాజరు నమోదును పరిశీలించారు.పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.దర్యాప్తును నాణ్యతతో పూర్తి చేసి న్యాయపరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.నేర నియంత్రణలో భాగంగా రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, బెయిల్‌పై ఉన్న నేరస్థులపై నిరంతర నిఘా కొనసాగించాలని తెలిపారు.అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై తరచూ తనిఖీలు, నాకాబందీలు నిర్వహించాలని, గ్రామాలు, పట్టణాల్లో రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత పటిష్ఠం చేసి ప్రజల్లో భద్రతాభావం పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డిఎస్‌పి కె.శివరాంరెడ్డి,నకిరేకల్ టౌన్ సీఐ హరిబాబు,ఎస్‌ఐలు వీరబాబు,కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

# వేగంగా ‘సర్’ ప్రక్రియ

### కలెక్టర్ చంద్రశేఖర్ నాగార్జునసాగర్‌లో ఓటరు జాబితా మ్యాపింగ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలన



**ప్రజాపక్షం/నందికొండ:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి,పెండింగ్‌లో ఉన్న మ్యాపింగ్‌ను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ బీఎల్‌ఓలను ఆదేశించారు.బుధవారం నాగార్జునసాగర్‌లోని 7,10,12 వార్డుల్లో బీఎల్‌ఓలు చేపడుతున్న సర్ ప్రక్రియ,ఓటర్ల మ్యాపింగ్ విధానాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఇంటింటికీ వెళ్లి బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న నమోదును పరిశీలిస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఒక బీఎల్‌ఓతో మాట్లాడుతూ మీ వార్డులో మొత్తం ఎన్ని ఓటర్లు ఉన్నారు.ఎన్ని ఫారాలు జనరేట్ అయ్యాయి ఎన్ని మ్యాపింగ్ చేశారు ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి అని ప్రశ్నించారు. దీనికి బీఎల్‌ఓ సమాధానంగా మొత్తం 961 ఓటర్లు ఉండగా, 593 మంది మ్యాపింగ్ పూర్తి చేశామని,మిగిలిన వాటిని త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు.దీనిపై స్పందించిన కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న ప్రతి ఓటరును గుర్తించి ఎలాంటి ఆలస్యం లేకుండా సర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.డోర్ లాక్ కారణంగా ఇంట్లో లేని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించి నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి సంబంధించిన డోర్ నంబర్ నమోదు చేస్తూ ఓటర్ల మ్యాపింగ్ చేయాలని చెప్పారు.అన్‌మ్యాపింగ్ అయిన ఓటర్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, వారి ఈపిఐసి నంబర్ ఉంటే నమోదు చేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ సైదులు,తహసిల్దార్ ఖాసీం,మున్సిపల్ చైర్‌పర్సన్ మానస స్వర్ణ సుమన్,కౌన్సిలర్ వినిష, డిప్యూటీ తహసిల్దార్ శ్రీదేవి,ఆర్‌ఐ సందీప్,అధికారులు,బీఎల్‌ఓలు,సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.



## వానలు లేక రైతన్న కన్నీరు... మొలక దశలోనే ఎండిన పైర్లు

**ప్రజాపక్షం/గుండాల:** ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయి నెల రోజుల కావస్తున్నా నేటికి మండల వ్యాప్తంగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతన్న ఖరీఫ్ ఆశలు ఆవిరైనట్లయింది. ఎల్‌నినో ప్రభావంతో చిరుజల్లులు మత్రమే కురిసి వానలు ముఖం చాటేసాయి. తొలకరి పడడంతో మండల వ్యాప్తంగా రైతులు ఎంతో ఆశతో కంది, పత్తి పంటలను వేయడంతో విత్తనాలు మొలకెత్తి ఎదిగే దశలో వానలు పడకపోవడంతో మొలకెత్తిన విత్తనాలు పూర్తి స్థాయిలో నీరు లేక ఎండ తీవ్రతకు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. అప్పులు తీసుకొచ్చి విత్తనాలు వేసిన రైతులు పంటలు ఎండి పోతుండడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వానలు పడాలని గ్రామాలలో గ్రామ దేవతలకు పూజలు చేస్తున్నా ఫలితం లేకుండా పోయిందని ఇది ఇలానే కొనసాగితే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు కోరతున్నారు.

## గిరిజన హక్కుల పరిరక్షణకు పోరాటాలు

### సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/సూర్యాపేట :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలపై గిరిజన హక్కుల పరిరక్షణ కోసం రాబోయే రోజుల్లో రాజీలేని పోరాటాలు నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో సూర్యాపేట జిల్లా 3వ మహాసభ గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు సుల్తాని వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై గిరిజన సమాజం అంతా ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ రాజారామ్ నాయక్ మాట్లాడుతూ గిరిజన సమస్యలపై పోరాటాలు నిర్వహించేందుకు జిల్లా కమిటి ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించాలన్నారు. అనంతరం గిరిజన సమైక్య నూతన కమిటిని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా రాయపూడి కాటంరాజు, ఉపాధ్యక్షులుగా భూక్య లలిత, బానోత్ ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుగులోతు రాజారాం, సహాయ కార్యదర్శిగా సుల్తాన్ వెంకటేశ్వర్లు, ఇస్లావత్ మనోజ్, కోశాధికారిగా జి. నరేష్‌తోపాటు 19 మందితో కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, సంఘ నాయకులు రాయపూడి కాటంరాజు, భూక్య లలిత, బానోత్ ప్రతాప్, గుగులోతు నరేష్, బానోతు రవి పాల్గొన్నారు.



# పశువైద్యశాలలో వైద్యుల కొరత

### వెలవెలబోతున్న కేంద్రం.... విలవిల లాడుతున్న మూగజీవాలు

### డాక్టర్లు లేక మూతపడే స్థితికి ప్రభుత్వ ఆసుపత్రి

### ప్రైవేట్ డాక్టర్లను ఆశ్రయించలేక రైతుల కన్నీరు

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల పరిధిలోని కందిబండ గ్రామంలో గల ప్రభుత్వ పశువైద్యశాలలో పర్యవేక్షణ క రువై పూర్తిగా వెలవెలబోతుంది. ఆసుపత్రిలో సరైన వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో మూగజీవాలకు సకాలంలో వైద్యం అందక రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ దుస్థితిపై సామాజిక కార్యకర్త పిఎల్‌వి మేళ్లచెరువుల లక్ష్మయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కందిబండ చుట్టుపక్కల గ్రామాల పరిధిలో వందలాది పాడిపశువులు, గొర్రెలు, మేకలు ఉన్నాయి. అత్యవసర సమయాల్లో లేదా వ్యాధుల బారీన పడినప్పుడు పశువులను ఈ కేంద్రానికి తీసుకవస్తే కనీసం పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. వైద్యులు లేకపోవడంతో ఆసుపత్రి ప్రాంగణం నిత్యం తాళాలు వేసి దర్శనం ఇస్తుందని స్థానికులు పిఎల్‌వి లక్ష్మయ్య మండిపడ్డారు.




**ప్రైవేట్ వైద్యులతో ఆర్థిక భారం**

ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు నిలిచిపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు ప్రైవేట్ ప్రాక్టిషనర్లను ఆశ్రయించాల్సి వస్తుంది. వారు అడిగినంతా ఫీజులు ఇచ్చుకోలేక సరైన సమయానికి మందులు అందక మూగజీవుల ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది గ్రామీణ రైతాంగాన్ని కోలుకోలేని ఆర్థిక దెబ్బ తీస్తుందని లక్ష్మయ్య పేర్కొన్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పశు సంపదే కీలకమైన ప్రాంతాలలో వెటర్నరి ఆసుపత్రిని ఇలా నిర్లక్ష్యం చేయడం సరికాదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కందిబండ పశువైద్యశాలకు శాశ్వత ప్రాతిపదికన అర్హులైన డాక్టర్లను, సి బ్బందిని నియమించాలని, ఆసుపత్రిని పూర్తిస్థాయి లో రైతులకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.



# స్వల్పకాలిక చికిత్సతో క్షయవ్యాధి దూరం

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: స్వల్పకాలిక వ్యాధితో క్షయవ్యాధిని దూరం చేయవచ్చునని కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ పద్మ తెలిపారు. బుధవారం మండలంలోని బూరుగడ్డ గ్రామ పంచాయతీ ఆవరణలో క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ పద్మ మాట్లాడుతూ 2030 నాటికి దేశం మొత్తాన్ని క్షయవ్యాధి రహితంగా మార్చడం టిబి ముక్త్ భారత్ లక్ష్యమని తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, బరువు కోల్పోవడం, తేమడలో రక్తజీరలు, రాత్రి వేళల్లో జ్వరం ఉన్నట్లయితే టిబిగా అనుమానించి వెంటనే పరీక్ష చేయించుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యరగాని రాధనాగరాజు, ఎంపివో లావణ్య, ఆరోగ్య కార్యకర్తలు ఇందిరాల రామకృష్ణ, ఝాన్సీ, రాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఒకే కుటుంబంలోని ఓట్లన్నీ ఒకే కేంద్రంలో ఉండాలి

ప్రజాపక్షం/మేళ్లచెరువు: ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ లో భాగంగా ఒకే కుటుంబానికి చెందిన సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలని ఆర్‌టిఐ కార్యకర్త రేళ్ల నర్సింహారావు ఎన్నికల అధికారులకు డిమాండ్ చేశారు. గతంలో ఒకే ఇంట్లో నివసించే కుటుంబ సభ్యుల పేర్లు వేర్వేరు వార్డులలో, వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో నమోదు కావడం వల్ల ఓటు వేసేందుకు ఓటర్లు, ప్రచారం నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. మేళ్లచెరువు గ్రామంలో ఇటువంటి సమస్యలు ఎక్కువగా వస్తుంటాయని పేర్కొన్నారు. ఈ గందరగోళానికి స్వస్తి పలికేందుకు ప్రస్తుత ఓటర్ల సవరణ ప్రక్రియను అధికారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాపక్షం/నడిగూడెం: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం సిరిపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్ గుండోజు చిన సోమయ్య మండల కేంద్రానికి చెందిన పెన్షనర్ కొరట్ల జయలక్ష్మి వారి జన్మదినం సందర్భంగా వారి గృహాలను సందర్శించి శాలువాలతో సన్మానించి కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఉపాధ్యాయ వృత్తి పరంగా విద్యార్థులకు ఎంతో సేవ చేశారని విశ్రాంత ఉద్యోగుల సంఘంలో భాగస్వాములుగా ఉండి తమ వంతు సహయ సహకారాలు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి ఖలీల్ అహ్మద్, లావూరి బాలాజీనాయక్, ఎండి ఇబ్రహీం, దున్న అంజయ్య, చిలకల గురులింగం, నామ మణెమ్మ పాల్గొన్నారు.

# నర్సయ్య ఆశయాలు కొనసాగించాలి

ప్రజాపక్షం/మోతె : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కొండా నర్సయ్య ఆశయాలు కొనసాగించాలని సిపిఎం మండల కమిటి సభ్యులు కక్కిరేణి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని బుర్కచర్ల గ్రామంలో 5వ వర్ధంతి సందర్భంగా నర్సయ్య స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో తనదైన పాత్రను పోషించి భూమి, భుక్తి, విముక్తి కోసం కామ్రేడ్ బియన్ రెడ్డి దళంలో పనిచేయడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాములు, గోపాల్, అచ్చయ్య, వెంకన్న, కొండ శ్రీరామ్, జ్యోతి, నర్సయ్య పాల్గొన్నారు.

# ఊపిరితిత్తుల మార్పిడితో బాధితులకు కొత్త జీవితం



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ఆధునిక వైద్య రంగంలో ఊపిరితిత్తుల మార్పిడి (లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్) ద్వారా తీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్న రోగులకు కొత్త జీవితం అందించడం సాధ్యమవుతుందని ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కొద్ది వారాల క్రితం ఊపిరితిత్తుల మార్పిడి చేయించుకున్న ఒక రోగి కేవలం 10 రోజుల్లోనే పూర్తిగా కోలుకొని డిశ్చార్జ్‌కు సిద్ధమైనట్లు తెలిపారు. ఆధునిక వైద్య సాంకేతికత, ఖచ్చితమైన పరీక్షలు, మెరుగైన చికిత్సల వల్ల ఇటువంటి ఫలితాలు సాధ్యమవుతున్నాయని చెప్పారు. ఊపిరితిత్తులు స్పాంజ్‌లా మృదువుగా ఉండాల్సి ఉండగా కరోనా, ధూమపానం, సిమెంట్ పరిశ్రమల్లో పని చేయడం వంటి వృత్తి సంబంధిత కారణాలు, అలాగే కొన్ని వ్యాధుల ప్రభావంతో గట్టిపడి ఫైబ్రోసిస్‌కు గురవుతాయని వివరించారు. అటువంటి పరిస్థితుల్లో శరీరానికి తగినంత ఆక్సిజన్ అందక రోగులు ఆక్సిజన్ సిలిండర్‌పైనే ఆధారపడాల్సి వచ్చేదన్నారు. అలాంటి వారికి లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అత్యంత ప్రభావవంతమైన చికిత్స అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ పరమేష్, మేనేజర్ ఉమేష్, అసిస్టెంట్ మేనేజర్ రాంప్రకాష్ పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి



ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : ప్రభుత్వం విద్యార్థుల తక్షణ సమస్యలను పరిష్కరించాలని బిఆర్‌ఎస్‌వి నాయకులు బంటు సందీప్ అన్నారు. బుధవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్స్ ప్రారంభమైన రోజు నుంచే యూనిఫామ్ పుస్తకాలు ఇస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం నెలరోజులు గడుస్తున్న విద్యార్థులకి యూనిఫామ్స్ ఒక్క జత కూడా ఇవ్వలేదన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పూర్తిస్థాయిలో అందించలేదన్నారు. పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని, బ్రేక్‌ఫాస్ట్ పథకం ప్రకటనకే పరిమితమైందన్నారు. రెండున్నర సంవత్సరాలుగా ముఖ్యమంత్రి విద్యశాఖను పెట్టుకొని ప్రభుత్వ విద్య వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే విద్యార్థులకు యూనిఫామ్, పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చామకూరి మహేందర్, బాదె అంజి, ఖమ్మంపాటి ఉదయ్‌కుమార్, లావూరి వాసు, యలబోయిన వంశీ పాల్గొన్నారు.

# డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, అద్దె వాహనాల నెలవారీ అద్దెను రూ.55వేలకు పెంచాలని తెలంగాణ అద్దె వాహనాల యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ పవన్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట అద్దె వాహనాల యజమానులు, డ్రైవర్లతో కలిసి నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017లో అప్పటి ఇంధన ధరలు, వాహనాల నిర్వహణ వ్యయాలను పరిగణలోనికి తీసుకొని ప్రభుత్వం నెలవారీ అద్దెను రూ.33వేలకు నిర్ణయించిందని తెలిపారు. ప్రస్తుతం ఇంధన ధరలు, విడిభాగాల ధరలు, నిర్వహణ ఖర్చులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో అద్దెను రూ.55వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో 15 నుంచి 18 నెలలుగా అద్దె వాహనాల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో వాహన యజమానులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రతి కలెక్టరేట్‌లో డ్రైవర్ల కోసం ప్రత్యేక విశ్రాంతి గది, వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న, తన్నీరు మహేష్, రహీం, సాయికుమార్, హరీష్, హుస్సేన్ నాయక్, సందీప్, జీవన్, కృష్ణ, సుమన్ నాయక్, సంతోష్, షరీఫ్ పాల్గొన్నారు.

# ఇంటింటి సర్వే వేగవంతం చేయాలి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఇంటింటి సర్వే, డిజిటలైజేషన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆర్డీవో, ఎన్నికల నమోదు అధికారి ఎస్.రమణారెడ్డి సూచించారు. మిర్యాలగూడ మండలంలోని చైతన్యనగర్ పోలింగ్ స్టేషన్ నెం.114 పరిధిలో కొనసాగుతున్న ఇంటింటి సర్వే ప్రక్రియను ఆర్డీవో రమణారెడ్డి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలు సేకరిస్తున్న ఓటర్ల వివరాలు, నమోదు ప్రక్రియ, డిజిటలైజేషన్ పనులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. డిజిటలైజేషన్ పనులను నిర్ణీత గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అని, ప్రతి అర్హుడి పేరు జాబితాలో నమోదు కావడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ తహసీల్దార్, బీఎల్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



# మూత్రశాలల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాపక్షం/నడిగూడెం: మండలంలోని వల్లాపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు మూత్రశాలలు లేక ఇబ్బందులకు గురవుతున్నారని ప్రధానోపాధ్యాయురాలు ద్వారా విషయం తెలుసుకున్న సర్పంచ్ కేసగాని సరిత లక్ష్మణ్ త్వరలో మూత్రశాలల నిర్మాణం చేస్తామని మాట ఇచ్చారు. వారం రోజులు తిరగకుండానే అధికారుల నుండి అనుమతి తీసుకుని మూత్రశాలల నిర్మాణం చేపట్టడానికి అనుమతులు తెచ్చారు. బుధవారం పాఠశాలలో మూత్రశాల నిర్మాణానికి ఎంపిడివో మల్సూర్‌నాయక్, పంచాయతీరాజ్ ఎఈ లావణ్యలను ఆహ్వానించి వారి సమక్షంలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రణబోతు మల్లారెడ్డి, ఉప సర్పంచ్ కోట చంద్రశేఖర్‌రెడ్డి, వార్డు సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పోలూరి సూరమ్మ, ఉపాధ్యాయులు పసుపులేటి ఉపేందర్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# దిగజారుడు మాటలు అహంకారానికి నిదర్శనం



ప్రజాపక్షం/మోతె : మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ దిగజారుడు మాటలు ఆయన అహంకారానికి నిదర్శనమని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య అన్నారు. విలేకరుల సమావేశంలో బొల్లం మల్లయ్య రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఉగ్రవాది గాను, నరహంతకుడు గాను అభివర్ణించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల చేత ఎన్నుకోబడిన ముఖ్యమంత్రి పై ఓటమిని జీర్ణించుకోలేక పిచ్చిపిచ్చిగా మాట్లాడడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. తక్షణమే మల్లయ్య యాదవ్‌పై కేసు నమోదు చేయాలని కోరుతూ ఎస్ఐ మల్లయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల సోషల్ మీడియా అధ్యక్షులు అర్వపల్లి గణేష్, మాజీ వైస్ ఎంపిపి శివరంజన్ రెడ్డి, సిరికొండ గ్రామ సర్పంచ్ బొర్ర వెంకటేష్, బుర్కచర్ల గ్రామ సర్పంచ్ కవిత రవి, అశోక్ రెడ్డి, బొడ్డు నర్సయ్య, బొర్ర మధు, గడ్డం రాంరెడ్డి పాల్గొన్నారు.

# రైతాంగంపై భారం మోపొద్దు

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ఎరువుల రవాణా భారం రైతాంగంపై మోపడం తగదని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో జరిగిన తెలంగాణ రైతు సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే పెరుగుతున్న సాగు ఖర్చులతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఎరువుల దిగుమతి రవాణా ఖర్చును రైతులపై మోపడం అత్యంత అన్యాయమన్నారు. గతంలో ఈ ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరించేదని, ఇప్పుడు ఒక్కో ఎరువుల బస్తాపై రూ.30 చొప్పున అదనపు భారం విధించడం రైతాంగంపై మరింత ఆర్థిక ఒత్తిడిని పెంచుతుందని విమర్శించారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు కందాల శంకర్ రెడ్డి, కొలిశెట్టి యాదగిరి రావు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కొప్పుల రజిత, దేవరం వెంకటరెడ్డి పాల్గొన్నారు.





## సిసిరోడ్లను దెబ్బతీయకుండా యుజిడి పనులు పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చేపడుతున్న పనుల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ఇప్పటికే నిర్మించిన సీసీ రోడ్లను పగలగొట్టకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని మిర్యాలగూడ మున్సిపల్ కౌన్సిలర్ శ్రీమతి నూకల కవిత వేణుగోపాల్ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం హౌసింగ్ బోర్డు సబ్ జైలు రోడ్డులో డ్రైనేజీ సమస్య తీవ్రతను గుర్తించిన ఆమె, యూజీడీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎస్టీపీ2 మెయిన్ ట్రంక్ పరిధిలోని వడ్డెరగూడెం, బాపూజీనగర్, రెడ్డి కాలనీ, ఇస్లాంపురం, కలాల్‌వాడ, పెద్దబజార్, కుండలబజార్, కూరగాయల మార్కెట్, ముత్తిరెడ్డికుంట, సుందర్‌నగర్, విద్యానగర్, హౌసింగ్‌బోర్డు, ఇందిరమ్మకాలనీ, ఈదులగూడెం ప్రాంతాల్లో డ్రైనేజీ పైపులు జామ్ అయిన పరిస్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డు కాంగ్రెస్ నాయకులు తిరుపతి రెడ్డి, రఫీ, పండు, రంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## మండల అధ్యక్షుడికి సత్కారం



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికైన తూముల సురేష్ రావును చీదెళ్ల గ్రామ కాంగ్రెస్ శ్రేణులు బుధవారం ఆయన నివాసంలో ఘనంగా సత్కరించారు. చీదెళ్ల గ్రామ సర్పంచ్ వరికల్లు పద్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సురేష్ రావును కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్, ముఖ్య నాయకులు మాట్లాడుతూ సురేష్ రావు పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరం ప్రభాకర్ రెడ్డి, గుర్రం అమృత రెడ్డి, పర్రెడ్డి లింగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటరాజ్, సైదిరెడ్డి, వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ ఎస్ఇకి సన్మానం

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** నల్గొండ సర్కిల్ విద్యుత్ ఎస్ఈ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులును బుధవారం దేవరకొండ డివిజినల్ మీటర్ కార్మికులు మార్యదపూర్వకంగా కలిసి బోకేలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎస్ఈ శ్రీనివాసులు మాట్లాడుతూ మీటర్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో దేవరకొండ డివిజినల్ మీటర్ కార్మికులు కాంట్రాక్టర్ అచ్యుత్, డివిజినల్ అధ్యక్షుడు సత్యనారాయణ, కొండమల్లేపల్లి సెక్షన్ లీడర్ సాయి వికాష్‌రెడ్డి, హనుమా, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



## మాదకద్రవ్య రహిత భారత నిర్మాణానికి సమష్టి కృషి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మాదకద్రవ్య రహిత సమాజ స్థాపనకు ప్రభుత్వం, విద్యాసంస్థలు, సమాజం, పౌరులు సమన్వయంతో ముందుకు సాగాలని నల్గొండ జిల్లా అదనపు ఎస్పి జి.రమేష్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కేంద్ర సమాచార,ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ)బుధవారం నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ సమగ్ర అవగాహన కార్యక్రమంలో అదనపు ఎస్పి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు,యువత చదువుతోపాటు క్రీడలు,ఇతర ఆసక్తి ఉన్న అంశాలలో రాణించడానికి కృషి చేయాలని సూచించారు. తెలంగాణ ఈగల్ ఫోర్స్ డిఎస్‌పి శంకర్ యాదవ్ తెలంగాణ పోలీసులు డ్రగ్స్ కట్టడికి తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ నిరంతర నిఘాతో పాటు టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 1908 ద్వారా ప్రజలు అందిస్తున్న సమాచారం రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ నెట్‌వర్క్‌లను గుర్తించడానికి, వాటిని నిర్మూలించడానికి ఎంతగానో దోహదపడుతోందని తెలిపారు. అనంతరం పాలిటెక్నిక్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు అదనపు ఎస్పి చేతుల మీదుగా సర్టిఫికెట్లతోపాటు బహుమతులు అందించారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డు విజేతలకు అభినందన



**ప్రజాపక్షం/కోదాడ:** కరాటే పోటీల్లో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడం అభినందనీయమని కోదాడ పట్టణ సిఐ శివశంకర్‌నాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ నందు ఏప్రిల్ 26న నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డు కరాటే పోటీల్లో పాల్గొని అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రపంచవేదికపై కోదాడ పేరును మారుమ్రోగించిన కరాటే మాస్టర్ కొండపల్లి క్రాంతికుమార్, ఆయన శిక్షణలోని విద్యార్థులను సిఐ శివశంకర్, ఎస్ఐ లు అభినందించి సన్మానించారు. అనంతరం సిఐ శివశంకర్‌నాయక్ మాట్లాడుతూ కరాటే వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ధైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయన్నారు. ఎస్ఐ లు కుసుమ ఉపేందర్‌రెడ్డి, అజయ్‌కుమార్, మల్సూర్ విజేతలైన విద్యార్థులు పొక్కుల ప్రణీత్, పోక్కుల రక్షిత్, శీలం వరుణ్, కంకిపాటి ఉదతి, తిరగమల్ల వేధశ్రీ నిత్య, మోకా అక్షయ్య, అక్షిత, వేముల కరుణ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడలో చౌరస్తాలను పునరుద్ధరించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణం గుండా వెళ్లే కోదాడజడ్చర్ల జాతీయ నాలుగు లేన్ల రహదారి నిర్మాణంలో భాగంగా ప్రధాన చౌరస్తాలను మూసివేసి డివైడర్లు నిర్మించడం వల్ల పట్టణ ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు పోగుల సైదులుగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని రహదారి కూడళ్ల వద్ద బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. ఈ సందర్భంగా మూసివేసిన చౌరస్తాల వల్ల ట్రాఫిక్‌కు ఎదురవుతున్న ఆటంకాలను వారు పరిశీలించారు. అనంతరం పోగుల సైదులు గౌడ్ మాట్లాడుతూ నాలుగు దారులు కలిసే ప్రధాన కూడళ్లను యథాతథంగా చౌరస్తాలుగా కొనసాగించకుండా, అవసరం లేని ప్రాంతాల్లో అశాస్త్రీయంగా యూటర్న్‌లు ఏర్పాటు చేయడం ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోందన్నారు. దీనివల్ల ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీలు, స్కూల్ బస్సులు, అత్యవసర సేవల వాహనాలు అనవసరంగా ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోందని వివరించారు. ఫలితంగా సమయం, ఇంధనం వృథా కావడంతో పాటు ట్రాఫిక్ రద్దీ పెరిగి నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం అధికమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాటి శివరామకృష్ణ, యువజన సంఘం నాయకులు సంతోష్, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

## 17న నల్లగొండలో ఎఐకెఎస్ జాతీయ మహాసభల సన్నాహక సమావేశం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఈ ఏడాది నవంబర్ 18 నుండి 21 వరకు నల్లగొండలో నిర్వహించనున్న అఖిలభారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశం ఈ నెల 17న నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఏచూరి గార్డెన్స్‌లో జరగనున్నట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం సిపిఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభల్లో దేశవ్యాప్త రైతాంగ సమస్యలు, ఉద్యమాల కార్యాచరణపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.ఈ సమావేశానికి ఏఐకేఎస్ అఖిలభారత ప్రధాన కార్యదర్శి విజె కృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి హాజరవుతున్నారు. వీరితో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు అల్దాస్ జానయ్య, అరిబండి ప్రసాద్ రావు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రాగిరెడ్డి మంగారెడ్డి, సిఐటియు రాష్ట్ర నాయకులు డబ్బికార్ మల్లేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మల్లు గౌతంరెడ్డి పాల్గొన్నారు.



## స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** విద్యార్థుల జీవితంలో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి, మోటివేషనల్ స్పీకర్ లయన్ సరికొప్పుల నాగేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ యువజన నైపుణ్య దినోత్సవం సందర్భంగా బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్పందన జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నళిని అధ్యక్షతన విద్యార్థుల కోసం ప్రేరణాత్మక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరికొప్పుల నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోని వాటి సాధన కోసం క్రమశిక్షణ, పట్టుదలతోకృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షులు గుండా సత్యనారాయణ, క్లబ్ సభ్యులు కొప్ప లక్ష్మినారాయణ, లాయర్ విశ్వనాథ్, గంధం సావయ్య, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## పోలీస్ అక్క అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థినులకు పోలీస్ అక్క కార్యక్రమంపై బుధవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హనుమాన్, మహిళ కానిస్టేబుల్ సింధు విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. మహిళ సాధికారత, మహిళల రక్షణ కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలను వివరించారు. విద్యార్థినులకు ఏవైనా సమస్యలు ఎదురైతే ధైర్యంగా పోలీసులను అశ్రయించాలని, ఫ్రెండ్లీ పోలిసింగ్ విధానం ద్వారా వారికి ఎల్లప్పుడు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మహిళల సమస్యల పరిష్కారంలో పోలీస్‌శాఖ అనుసరిస్తున్న అనుకూల దృక్పదం, బాధితులకు అందించే కౌన్సిలింగ్, సరైన మార్గదర్శకత్వంపై విద్యార్థినులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. మహిళ పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వరద విపత్తులపై అవగాహన



**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము;** నేరేడుగొమ్ము మండలం డిజాస్టర్ మేనేజిమెంట్ (విపత్తు నిర్వాహణ) కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులు, ఎస్డిఆర్‌ఎఫ్ బృందాలు, వివిధ శాఖల అధికారులతో బుధవారం అసిస్టెంట్ కమాండెంట్ వెంకన్న అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా విపత్తు ముందు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అవగాహన కల్పించారు. అదే విధంగా పెద్దమునిగల్ గ్రామాన్ని పొటాషియల్ ఏరియాగా గుర్తించి గ్రామంలో సదస్సులు పెడితే ఉపయుక్తంగా ఉంటుందని భావించి అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కేతావత్ అంజలి, అడిషనల్ డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ హర్షకుమార్, నేరేడుగొమ్ము తహశీల్దార్ ఉమాదేవి, ఎంపిడివో విజయ్‌పాల్, ఎస్ఐ నాగేంద్రబాబు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ యాదగిరి, ఎంఈవో బ్రహ్మాచారి, మెడికల్ ఆఫీసర్ రాజేష్, కార్యదర్శి బాలరాజు, అధికారులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విఓఏలకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలు అమలేవీ?

**ప్రజాపక్షం/నాంపల్లి :** తెలంగాణ ఐకెపి వివోఏ ఉద్యోగులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు వచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు అమలు చేయడంలో విఫలమైందని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్ లక్ష్మీనారాయణవిమర్శించారు.బుధవారం నాంపల్లి మండల ఐకెపి వివోఏలు అందరూ సిఐటియు యూనియన్‌లో చేరారు సిఐటియు కండువాకట్టి సంఘంలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందర వివోఏలకు మేం అధికారంలోకి వస్తే 18 వేల కనీస వేతనాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు చిలుముల దుర్గయ్య ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి,సిఐటియు మండల కన్వీనర్ ఎదుళ్ళ సునీత,కో కన్వీనర్ రేవెల్లి యాదయ్య, సిఐటియూలో చేరిన వారు వివోఏలు సంతోష,అలివేలు,వల్లి బిక్షపొమ్మ,ఏ కవిత,రజిత,మమత,యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అంతిరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు



ప్రజాపక్షం/డిండి; డిండి మండలం ఖానాపూర్ గ్రామపంచాయతీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గ్రామశాఖ అధ్యక్షులు ముత్యాని అంతిరెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ పేర్కొన్నారు. అంతిరెడ్డి మృతి విషయం తెలుసుకున్న ఎంఎల్ఏ బాలునాయక్ ఖానా పూర్ గ్రామానికి చేరుకొని ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో డిండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు యాదగిరిరావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు, శాంతిగూడెం సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్‌రెడ్డి, సర్పంచ్ శంకర్, రవి ఉన్నారు.

## డిండి పరుగుల దుందుభి ప్రవళికకు ఘన స్వాగతం




ప్రజాపక్షం/డిండి; చైనాలోని ఒరిడోస్‌లో జరిగిన ఆసియా అండర్23అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో భారత జట్టు తరపున 4400 మీటర్ల రిలే పోటీలో పాల్గొని ఇటీవల బంగారు పతకం సాధించిన డిండి గ్రామానికి చెందిన నారిమళ్ల ప్రవళిక బుధవారం స్వగ్రామానికి తిరిగి రావడంతో స్థానిక బస్టాండ్ వద్ద గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష తమ పాఠశాల విద్యార్థులతో కలిసి ఘన స్వాగతం పలికారు. పాఠశాల వరకు ర్యాలీగా వెళ్లారు. డిండి సర్పంచ్ నల్లగంతుల రవి కాంగ్రెస్, బిఆర్ఎస్ స్థానిక నాయకులు ప్రవళికను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మీ విజయం దేశానికే కాదు, డిండి గ్రామానికి ఎనలేని గౌరవాన్ని తీసుకొచ్చిందని భవిష్యతులో మరెన్నో విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.

## సరుకులు అందజేత

ప్రజాపక్షం/దేవరకొండ; ఓ దాత నిరుపేద ఐకెపి వివోఏ కుటుంబానికి ఓదార్యం చాటుకున్నాడు. మండలంలోని గొట్టిముక్కల గ్రామానికి చెందిన ఐకెపి వివోఏ దేప నిరంజన్‌రెడ్డి కుటుంబానికి బుధవారం పిపిపల్లి మండలం రోలకల్లు గ్రామానికి చెందిన దాత హర్షవర్ధన్ రెడ్డి సహకారంతో వివోఏ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకనబోయిన వెంకన్న, దేవరకొండ డివిజన్ అధ్యక్షులు ముదిగొండ రామదాసు ఒక క్వింటాల్ బియ్యం, రూ. 4300 విలువగల నిత్యవసర సరుకులను అందజేశారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటయ్య, వివోఏ బ్రహ్మం ఉన్నారు.



## అర్హులైన ప్రతీ ఓటరు పేరు జాబితాలో ఉండాలి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు అయ్యేలా అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. మండలంలోని చింతపల్లి గ్రామంతో పాటు పట్టణంలోని పలు వార్డుల్లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే ఓటరు నమోదు, వివరాల సవరణ, కొత్త దరఖాస్తుల స్వీకరణ, అవసరమైన ధ్రువపత్రాల పరిశీలన తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఓటర్లకు అందుతున్న సేవలపై ఆరా తీసి సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించి ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని బీఎల్ఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సామరస్యం, ధర్మ పరిరక్షణే లక్ష్యం



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : గ్రామాల్లో ధర్మ పరిరక్షణ, ప్రజల్లో భక్తి భావం, సామరస్య వాతావరణం పెంపొందించడమే లక్ష్యంగా శ్రీరామ హృదయం కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ బ్యాంకెట్ హాల్లో శ్రీరామ హృదయం సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. శ్రీరాముని కరుణ, ఆశీర్వాదాలు ప్రతి గ్రామానికి చేరేలా శ్రీరామ హృదయం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో భక్తి, ఐక్యత, ఆధ్యాత్మికత చైతన్యం పెంపొందుతాయని చెప్పారు. వికాస తరంగిణి సేవకులు ఈ కార్యక్రమాన్ని ప్రతి గ్రామానికి తీసుకెళ్లి ప్రజలను భాగస్వాములను చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా నిర్వహించే ఏకోత్తర సహస్ర కలశాభిషేకం (1001 కలశాలతో అభిషేకం) విశిష్టమైన ఆధ్యాత్మిక మహోత్సవమని చెప్పారు. ఈ పవిత్ర కలశాలు గ్రామాలకు చేరుకోవడంతో సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రజలు సుఖ శాంతులతో జీవించాలని, గ్రామాల్లో ఎలాంటి ఉపద్రవాలు లేకుండా అన్ని వర్గాల ప్రజల మధ్య సామరస్యం నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మురళీధరాచార్యులు, రామానుజాచార్యులు, అశోక్ రావు, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర రావు, చకిలం వేణుగోపాల్, ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించే వరకూ పోరాటం



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సూర్యాపేట ఎంతో కీలకమైన నగరం అయినప్పటికీ రైల్వే లైన్ లేకపోవడం ఎంతో విచారకరమని రైల్వే సాధించేందుకు తప్పనిసరిగా నిరంతరం పోరాటం అవసరమని ప్రముఖ వైద్యులు, మున్సిపల్ కౌన్సిలర్ డాక్టర్ రామ్మూర్తి యాదవ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సూర్యాపేట చుట్టూ అనేక రైల్వే లైన్లు ఉన్నాయని అటు ఖమ్మం, నల్లగొండ, మిర్యాలగూడ, చిట్యాల లేదా జనగాం నుండి గాని రైల్వే లైన్ తీయాలని ఎంతో కాలంగా సూర్యాపేట ప్రజలు అడుగుతూ వచ్చారని కానీ ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి నేపథ్యంలో ఉద్యమాల అవసరాలు ఏర్పడతాయని ఈ ఉద్యమం ఎప్పటికప్పుడు అనేక కార్యక్రమాలు తీసుకొని ఈ కార్యాలయం ద్వారా ప్రజలను చైతన్యపరిచి బలమైన ఉద్యమాలు నిర్మించి సూర్యాపేట రైల్వే సాధించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పక్షాల నాయకులు రాజకీయాలకు అతీతంగా సూర్యాపేటకు రైలు సాధించేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. రంగారెడ్డి, లింగంపల్లి భద్రయ్య, రాచూరి ప్రతాప్, చింతలపాటి చిన్న శ్రీరాములు, నీలా శ్రీనివాస్, గద్దం వెంకన్న, కారింగుల వెంకన్న పాల్గొన్నారు.

## 20 గుంటల భూమిపై కన్నేసిన సర్పంచ్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : 70ఏళ్లుగా కబ్జాలో ఉన్న 20 గుంటల భూమిపై కన్నేసి భూమిలో ఉన్న నిర్మాణాలపై జెసిబి సహాయంతో ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని భూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని చెన్నుగూడెం గ్రామంలో సుమారు 70ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్న భూమిలోకి సర్పంచ్ మర్రి సతీష్ ఆయన వర్గీయులు అక్రమంగా చొరబడి జేసీబీల సహాయంతో భూమిలో ఉన్న బండరాలను తొలగించడంతోపాటు భూమిని చదును చేశారని తెలిపారు. అక్కడ ఉన్న నిర్మాణాలను సైతం ధ్వంసం చేస్తున్నారని బాధితులు ఆరోపించారు.ఈ ఘటనను అడ్డుకునేందుకు ప్రయత్నించిన తమపై దాడులకు యత్నించారని,నిర్మాణాలు కూల్చివేస్తున్న సమయంలో 100 నంబర్‌కు ఫోన్ చేసినప్పటికీ పోలీసులు సంఘటన స్థలానికి వచ్చిఎలాంటి చర్యలు తీసుకోకుండా వెనుదిరిగారని వారు వాపోయారని వెల్లడించారు. ఈ సమావేశంలో బాధితులు మర్రి లింగయ్య,చంద్రయ్య, రాములు, యాదయ్య,ఐలయ్య,సైదులు, నరసింహ,శేఖర్,నరేష్ పాల్గొన్నారు.

## 19న ఉచిత నీట్-2026 మార్గదర్శకలపై అవగాహన

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :వైద్య విద్యలో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం అందించేందుకు ఈ నెల 19వ తేదీ (ఆదివారం) నల్లగొండ పట్టణంలో ఉచిత నీట్2026 మార్గదర్శక శిక్షణా కార్యక్రమం డాక్టర్ ఏపి ఖాన్ ఆధ్వర్యంలో నేషనల్ షరీఫుద్దీన్ సహకారంతో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమం ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఓల్డ్ సిటీలోని నేషనల్ ఎయిర్ కూలర్స్ అండ్ వాటర్ ప్లాంట్ ప్రాంగణంలో(ఎస్‌సి హాస్టల్ సమీపంలో) జరగనుంది.ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్య విద్య ప్రవేశాల కౌన్సెలింగ్ నిపుణుడు అబ్దుల్ రబ్ ఆరిఫ్ పాల్గొని విద్యార్థులు,వారి తల్లిదండ్రులకు నీట్ కౌన్సెలింగ్ విధానం,ఎంబీబీఎస్,బీడీఎస్,ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాలు,కళాశాలల ఎంపిక,రాష్ట్ర కోటా,అఖిల భారత కోటా,ఫీజుల విధానం,ఉపకార వేతనాలు, వైద్య విద్యలో కెరీర్ అవకాశాలు వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు.అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రుల సందేహాలకు నిపుణులు సమాధానాలు ఇవ్వనున్నారు.నల్లగొండ జిల్లాతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన నీట్2026 అభ్యర్థులు,వారి తల్లిదండ్రులు ఈఉచిత శిక్షణా కార్యక్రమంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎన్‌జి కళాశాల విద్యార్థులకు సెంట్రల్ యూనివర్సిటీలో అవకాశం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: నాగార్జున ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన ముగ్గురు విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఇద్దరికీ,మరొకరికి కేరళ సెంట్రల్ యూనివర్సిటీ లో సీట్లు వచ్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఉపేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోతి నవీన్ కు ఎమ్మెస్సీ గణితశాస్త్రంలో,గోస్కుల అఖిలకు ఎమ్మెస్సీ భౌతికశాస్త్రంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో,కొత్త లోకేష్ కు కేరళ సెంట్రల్ యూనివర్సిటీలో రాజనీతి శాస్త్రంలో సీట్లు వచ్చినట్లు తెలిపారు.కళాశాల నుండి ఒకేసారి ముగ్గురికి సీట్లు రావడం గర్వకారణమని, దీన్ని జూనియర్ విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు పొందిన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పరంగి రవి కుమార్, డాక్టర్ అంతటి శ్రీనివాసులు,పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ దాసరి మునిస్వామి, విద్యార్థిక సమన్వయకర్త బత్తిని నాగరాజు తదితర అధ్యాపకులు అభినందించారు.

## 19న దీనా విజ్ఞాన మందిర్ స్కూల్ స్వర్ణోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: నల్లగొండలోని దీనా విజ్ఞాన మందిర్ పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలను ఈనెల 19న నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ సయ్యద్ హిత రాణి, పూర్వ విద్యార్థి నల్ల అమరేందర్ తెలిపారు.మంగళవారం పట్టణంలోని దీనా విజ్ఞాన మందిర్ పాఠశాలలో గోల్డెన్ జూబ్లీ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీనా విజ్ఞాన మందిర్ పాఠశాల 1976లో స్థాపించబడి 2026 నాటికి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 19న పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులోని ఎంపి బేగ్ ఫంక్షన్ హాల్‌లో స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు.ఈవేడుకలకు పూర్వ ఉపాధ్యాయులు,విద్యార్థులు హాజరై గత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు 50 సంవత్సరాల తర్వాత కలుసుకోనున్నందున ఈ అపురూపమైన కలయికను ప్రతి ఒక్కరూ ఆస్వాదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు సర్దార్ ఖాన్,సాబేర్ సాబ్,అబీన్స్, సమద్,జాకీర్ అబ్దుల్,వహాబ్, అజీజ్ ఉల్లా ఖాన్,గఫార్, రమేష్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు కల్యాణలక్ష్మి-షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/నార్కెట్‌పల్లి** :మండలానికి చెందిన కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం గురువారం ఉదయం 10 గంటలకు నార్కట్‌పల్లిలోని డోకురి గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వేణుగోపాలరావు తెలిపారు.ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరై మండలానికి చెందిన 102 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు,ప్రజాప్రతినిధులు, కళ్యాణలక్ష్మిషాదీ ముబారక్ లబ్ధిదారులు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## అన్నదాన కార్యక్రమం

**ప్రజాపక్షం/నకిరేకల్** : నకిరేకల్ లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి సతీమణి కీర్తిశేషులు కందాల లక్ష్మి జ్ఞాపకార్థం లయన్స్ క్లబ్, నవ్య క్లబ్‌ల ఆధ్వర్యంలో అక్షర ఫౌండేషన్, సుశీల దేవి ట్రస్టు సహకారంతో నిర్వహించిన ఫ్రీ మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో భవన నిర్మాణ కార్మికులు,దినసరి కూలీలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ చార్టర్ అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సూర్యచంద్రరావు, నవ్య క్లబ్ అధ్యక్షురాలు డి. పద్మజ, సుశీల దేవి ట్రస్టు చైర్మన్ ఎన్.రామ్మోహన్‌రావు,అక్షర ఫౌండేషన్ చైర్మన్, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు రేపాల సతీష్,లయన్స్ క్లబ్ కార్యదర్శి అండెం వెంకన్న, కోశాధికారి పోతుల శ్యామ్ పాల్గొన్నారు.




## ఎస్‌సి వర్గీకరణ పేరుతో దళితులపై రాజకీయ కుట్ర



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : ఎస్‌సి వర్గీకరణ పేరుతో దేశవ్యాప్తంగా దళితులపై రాజకీయ కుట్ర జరుగుతోందని, దీనికి వ్యతిరేకంగా పార్లమెంట్‌లో చట్టం చేసే వరకు తమ పోరాటం శాంతియుతంగా కొనసాగుతుందని మాల మహానాడు ఫౌండర్ అండ్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.ఎస్ రత్నాకర్ పేర్కొన్నారు.మంగళవారం నల్లగొండ పట్టణంలోని స్టెయిన్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ అమలుతో మాల సామాజిక వర్గం తీవ్రంగా నష్టపోయిందని ఆరోపించారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మాలల ఉనికికి ముప్పు ఏర్పడిందని, తాము విశ్వసించిన కాంగ్రెస్ పార్టీనే తమ సామాజిక వర్గానికి అన్యాయం చేసిందని విమర్శించారు.ఎస్‌సి వర్గీకరణకు దేశంలో తొలి అడుగు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో పడిందని, అనంతరం కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేసిందని అన్నారు. ప్రస్తుతం ఎస్సీ రిజర్వేషన్ల ఫలాలు కొద్దిమందికే పరిమితమవుతున్నాయని పేర్కొంటూ, దేశవ్యాప్తంగా ఉన్న 1,108 ఎస్సీ కులాలకు ఈ రిజర్వేషన్ ప్రయోజనాలను ఎలా సమానంగా పంచుతారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు బీరం సతీష్ కుమార్,ఈద అంజయ్య,మానే కాశయ్య,బోగరి విజయ్ కుమార్, అనిమల్ల నరహరి, నాని, చిన్నా పాల్గొన్నారు.

## నారాయణలో విద్యార్థులకు ఎన్నికలు



**ప్రజాపక్షం/నకిరేకల్** : పట్టణంలోని నారాయణ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు.పాఠశాల విద్యార్థి ప్రతినిధులైన హెడ్‌బాయ్,హెడ్ గర్ల్, స్పోర్ట్స్ లీడర్‌తో పాటు నాగ్,అగ్ని,పృథ్వి,త్రిశూల్ జట్ల కెప్టెన్ల ఎంపిక కొరకు ఈ ఎన్నికలు నిర్వహించారు.ఉదయం నుంచే విద్యార్థిని విద్యార్థులంతా ఎంతో ఉత్సాహంగా,చురుగ్గా ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఒకరినొకరు పోటీ పడుతూ క్రమశిక్షణతో ఓట్లు వేసి తమ ప్రతినిధులను ఎన్నుకున్నారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారాయణ పాఠశాలల నల్లగొండ జోన్ ఏజిఎం శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాచకొండ నరేష్,ఏఓ క్రాంతి,డిన్ శివప్రసాద్ హాజరయ్యారు.ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాచకొండ నరేష్ మాట్లాడుతూ పాఠశాల దశ నుంచే విద్యార్థులలో ప్రజాస్వామ్య ప్రక్రియపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ హసీనా,ఉమామహేశ్వరి, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేశ్‌కు సత్కారం



**ప్రజాపక్షం/నార్కెట్‌పల్లి** : నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన దొండ రమేశ్‌ను ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ జిల్లా స్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని దొండ రమేశ్‌కు సూచించారు.దొండ రమేశ్ మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని,గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరవేసి,కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాయం శ్యాంసుందర్ రెడ్డి,చెరువుగట్టు దేవస్థానం చైర్మన్ వారాల రమేష్, మాజీ చైర్మన్ బింగి కొండయ్య,నల్ల వెంకన్న,దాసరి రాజు, మాదాసు నరసింహ,జిల్లా మహేష్,గొలుసుల చందు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు బాగుపడిన స్మశాన వాటిక...!

**ప్రజాపక్షం/హాలియా**: చచ్చినా చావే అన్నట్లుగా ఉండేది ఈ స్మశాన వాటిక...గత కొన్నేళ్లుగా ఇబ్రహీంపేట వాగు వెంట హాలియా గ్రామస్తుల సౌకర్యం కోసం ఇక్కడో స్మశాన వాటిక తయారైంది. స్మశాన వాటికకు ఉండాల్సిన కనీస సౌకర్యాలు లేనప్పటికీ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చనిపోయిన వారికి దహన సంస్కారాలు చేసుకునేందుకు వీలుగా ఉండేది. కాలక్రమంలో హాలియా మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత ఇక్కడో స్మశాన వాటిక నిర్మించాలని నిధులు మంజూరు చేసినా గుత్తేదారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో నిర్మాణం పనులు ముందుకు సాగలేదు. దీంతో హాలియాలోని కొంత భాగం ప్రజలకు ఇక్కడి స్మశాన వాటికలో సౌకర్యాలు లేక చనిపోయిన వారికి ఇక్కడ దహన సంస్కారాలు చేసేందుకు ఇబ్బందులు పడేవారు. కనీసం మృతదేహాన్ని వాగులోకి తీసుకు వెళ్లేందుకు ఆ నలుగురికి మాత్రమే వీలు ఉండేది. మిగిలిన వారంతా రోడ్డుపైనే చివరి చూపు చూసుకునేవారు. మున్సిపాలిటీ అయిన తర్వాత పాత రెండు, 12వ వార్డు సభ్యులు ఎవరైనా చనిపోతే ఈ వాగులో దహన సంస్కారాలు చేసేవారు. ఆ సమయంలోనే టిఆర్ఎస్ ప్రభుత్వంలో 30 లక్షల రూపాయలతో ఇక్కడ వైకుంఠధామం నిర్మించుకునేందుకు నిధులు మంజూరు అయ్యాయి. కానీ నిర్మాణం చేపట్టేందుకు గుత్తేదారులు ఎవరు ముందుకు రాకపోవడంతో ఆ నిధులు అలానే ఉండిపోయాయి. ప్రస్తుతం ఇక్కడ కొత్త వైకుంఠధామం నిర్మించకపోయినా పాత స్మశాన వాటికలో చెట్లు, చెత్త పేరుకుపోయి కనీసం మనుషులు అందులోకి వెళ్లే పరిస్థితి లేకుండా ఉండేది. దీంతో చనిపోయిన వ్యక్తికి దహన సంస్కారాలు చేయడం అంటే చచ్చేంత చావు అయ్యేది. ఈ పరిస్థితిని గుర్తించిన మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డిలు ఈ ప్రాంతాన్ని పరిశీలించి గత రెండు రోజులుగా ఇక్కడ పేరుకుపోయిన కంపచెట్లను, చెదురుగా పడి ఉన్న చెత్తను యంత్రాల సహాయంతో శుభ్రం చేసి స్మశాన వాటికకు కొత్త రూపు తెచ్చారు. ఇన్నాళ్ల తర్వాత ఇక్కడ దహన సంస్కారాలు చేసుకునేందుకు మంచి స్థలం ఉందని గుర్తించేలా పనులు చేపట్టిన తీరు గమనార్హం. దీంతో ప్రస్తుతం మారిన హాలియా మున్సిపాలిటీలోని నాలుగు, ఐదు వార్డుల వారికి స్మశాన వాటిక సమస్య కొంత తీరిందనే చెప్పాలి.





## మరణించినా..జీవిద్దాం!

**ప్రజాపక్షం/నకిరేకల్** : మరణానంతరం కూడా అవయవదానం ద్వారా మరొకరికి పునర్జన్మ ప్రసాదించవచ్చని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆర్. వీరబ్రహ్మం అన్నారు. బుధవారం నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జీవశాస్త్రల విభాగం ఆధ్వర్యంలో అవయవదాన మాసోత్సవం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోస్టర్ మేకింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బెల్లి సాయిలు జ్ఞాపకార్థం నగదు పారితోషికాలను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బెల్లి యాదయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో బాటనీ అధ్యాపకులు డాక్టర్ శంకర్ సమన్వయకర్తగా వ్యవహరించారు.ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగు,అధ్యాపకులు ప్రవీణ్ రెడ్డి,డాక్టర్ శ్రీనివాసాచారి, శ్రీనివాస్,హరిత, మధుసూదన్ రెడ్డి,నర్సింహాచారి,ఉపేందర్,రవీందర్,సుభాషిణి,కార్యాలయ సిబ్బంది వెంకన్న, సుదర్శన్, వెంకట్ రెడ్డి, కార్తీక్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ శ్రేణుల నిరసన



**ప్రజాపక్షం/నడిగూడెం:** ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలకు కాంగ్రెస్ శ్రేణులు బుధవారం మండల కేంద్రంలో నిరసన తెలిపి మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొక్క బిక్షపతి కోదాడ వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటి చైర్మన్ ఏపూరి తిరపతమ్మ సుధీర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు తీవ్రంగా ఖండించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రస్తుత సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బొల్లం మల్లయ్యయాదవ్ దిష్టిబొమ్మ దగ్ధం



**ప్రజాపక్షం/అనంతగిరి:** మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ మీడియా సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన నిరాధారమైన, అనుచిత వ్యాఖ్యలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు శ్రీనివాసరెడ్డి తీవ్రంగా ఖండించారు. బుధవారం మండల కేంద్రంలో మల్లయ్యయాదవ్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి మాట్లాడారు. అనంతరం మండల పోలీస్‌స్టేషన్‌లో మల్లయ్యయాదవ్‌పై కేసు పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ బుర్రా పుల్లారెడ్డి, డేగ కొండయ్య, చుండూరు వెంకటేశ్వర్లు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 700 గొర్రెలు, 250 మేకలకు టీకాలు

**ప్రజాపక్షం/నకిరేకల్** : రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బోల్లేపల్లి గ్రామంలో గొర్రెలు,మేకలకు ఉచితంగా టీకాలు వేశారు.డాక్టర్ రవి ఆదేశాల మేరకు ఎల్ఎస్ఏ అరుణ,గోపాలమిత్ర చేరుకు శ్రీనివాస్,సిబ్బంది కిరణ్,రేణుక రైతుల ఇళ్లకే వెళ్లి సుమారు 700 గొర్రెలు,250 మేకలకు వ్యాక్సినేషన్ నిర్వహించారు.పశువుల్లో వ్యాధుల నివారణే లక్ష్యంగా ఈకార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

